పాడేరు మోద కొండమ్మను దర్శించుకున్న కూటమి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు

విశాలాంధ్ర - చోడవరం : ఉత్తరాంధ్ర కల్పవల్లిగా పేరుగాంచిన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మోదకొండమ్మ వారిని చోడవరం కూటమి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆదివారం దర్శించు కున్నారు. ఈ నెల 9,10,11 తేదీల్లో అమ్మవారు జాతర సందర్భంగా ఎమ్మెల్యే రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి, మోదకొండమ్మ ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ అధికారులు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఎమ్మెల్యే రాజుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు వెంట టి.డి.పి. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే తారు ప్లాంట్

పంచాయితీ, రెవెన్యూ, పొల్యూషన్ శాఖలు పట్టించుకోరా...

చేనుల అగ్రహారం గ్రామాన్ని కాలుష్యం కాటేయనుందా...

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జిల్లాలోని అనకాపల్లి మండలం కోడూరుబి కొండుపాలెం రోడ్డులో సబ్బవరం రెవెన్యూ సర్వేనెంబర్ పరిధిలో చేనుల అగ్రహారం గ్రామానికి అతి సమీపంలో అనుమతులు లేకుండానే అక్రమ తారు ప్లాంట్ నిర్మాణం జరిగి, ప్లాంట్ వినియోగంలోనికి వచ్చింది. అయినప్పటికీ అధికారులకు కనిపించకపోవడంపై చేనుల అగ్రహారం, కొండు పాలెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పంట పొలాలను వ్యవసాయ ఇతర అవసరాలకు ఉపయోగించుకునే ముందు ఆ భూమిని కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది.. కానీ ఈ తార్ ప్లాంట్ యాజమాన్యం ఆ నిబంధనలను పక్కన పెట్టేసి కన్వర్షన్ చేయకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టింది. అంతేకాకుండా భూమి ఏ రెవెన్యూ పరిధిలో ఉన్న సరే తారు ప్లాంట్ నుంచి వచ్చే కాలుష్యం వల్ల సమీప గ్రామాలకు ప్రమాదం ఉంటుంది కాబట్టి ఆ పంచాయతీ అనుమతి, గ్రామసభ నిర్వహించాలి. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధన పాటించలేదు. అంతేకాకుండా ప్లాంట్ ఏర్పాటు సమయంలో దీనివల్ల ఎటువంటి కాలుష్యం లేదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వద్ద అనుమతి తీసుకోవాలి.. అది కూడా ప్లాంట్ యాజమాన్యం తీసుకోలేదు.. నిబంధనలను అతిక్రమించి, మేనేజ్మెంట్ అనే పాలసీని బాగా వంట పట్టించుకుని అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమంగా తార్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కోడూరుబికొండూపాలెం రోడ్డులో భారీ వాహనాలు కు అనుమతి లేదు. ఈ ప్లాంట్ యజమాన్యం భారీ వాహనాలతో గత వారం రోజులుగా రోడ్డు నిర్మాణాల కోసం మెటీరియల్ తరలించడంతో రోడ్డు భారీ మరమ్మలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకపోవడమే కాకుండా, తార్ ప్లాంట్ వల్ల వచ్చే కాలుష్యంతో తమ ఆరోగ్యాలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తక్షణమే ప్లాంటును మూసి వేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా అక్రమ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తరాంధ్రలో కాపులంతా తూర్పు కాపులే

ప్రభుత్వ జీవోలతోనే బిసి డి సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - మాడుగుల : ఉత్తరాంధ్రలో ఉన్న కాపులంతా తూర్పు కాపులేనని, ప్రభుత్వాలు ఇచ్చే జీవోలతోనే కుల ధృవీకరణ బిసి డి సర్టిఫికెట్లు పొందుతున్నామని ఉత్తరాంధ్ర తూర్పు కాపుల కుల పెద్దలు యర్రంశెట్టి సత్యారావు, వడిసా బాలకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బసవ పరమేశ్వరరావు గొడౌన్‌లో మాడుగుల, బుచ్చియ్యపేట, చోడవరం జిల్లాలో పలు మండలాల నుండి తూర్పు కాపులతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశం ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వీరు మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వంటి జిల్లాల్లో కాపులుగా ఉన్న వారంతా, తూర్పు కాపులేనని, ఇందుకు తగ్గ కుల ధఅవీకరణ పత్రాలు జారీ విషయంలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి జీవో ప్రకారం ధఅవ పత్రాలు ఎప్పటినుండో మంజూరు అవుతున్నాయన్నారు. అయితే తమ సామాజిక వర్గాన్ని అన్ని విధాలా దెబ్బతీయడానికి మాడుగులకు చెందిన మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ కక్ష పూరితంగా వ్యవహరిస్తూ తమ సామాజిక వర్గానికి నష్టం చేకూర్చే విధంగా ఈ నెల 1వ తేదీన మండల పరిషత్ సమావేశంలో బిసి డి సర్టిఫికెట్ల మీద రాద్ధాంతం చేసారని, అసలు తూర్పు కాపుల గురించి మాట్లాడే వేదిక మండల పరిషత్ కార్యాలయం కాదని, ఇప్పటి వరకు తూర్పు కాపులకు చెందిన ఎంపీటీసీలతో రెండున్నరేళ్లకు పైగా పదవిని అనుభవించి, నేడు పదవి పోయిందన్న ఉక్రోసంతో తూర్పు కాపులను ఇబ్బందులకు గురి చేయడానికి చూస్తున్నారని అన్నారు. విశాఖ జిల్లాలో కాపులంతా తూర్పు కాపులేనని, అప్పట్లో పరవాడ ఎమ్మెల్యే పైలా అప్పల నాయుడు ప్రభుత్వానికి నివేదిక పంపించిన విషయాన్ని గుర్తు చేసారు. 1970కి పూర్వం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వీరి స్థితిగతులను ఆచర వ్యవహారాలను ప్రభుత్వాలు అధ్యయనం చేసి కమీషన్ ఏర్పాటు చేసి ఈ కులంలో మహిళలు వివాహాల విషయంలో కూడా పరిగణలోకి తీసుకుని తూర్పు కాపులుగా గుర్తించారని, అలాగే విశాఖ జిల్లాలో కూడా తమ బంధుత్వాలు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలు, జిల్లా కలెక్టర్‌లు కూడా తూర్పు కాపులకు సర్టిఫికెట్లు జారీ విషయంలో ఆలోచన చేసే తమకు కుల ధఅవీకరణ పత్రాలు జారీ చేసారన్నారు. గత ప్రభుత్వం విశాఖ ఉమ్మడి జిల్లాలో తూర్పు కాపులు ఉన్నారనే ఉద్దేశ్యంతోనే మాడుగుల, ఎం.కోడూరు గ్రామానికి చెందిన గొల్లవిల్లి ప్రభావతిని తూర్పు కాపు కార్పొరేషన్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గా నియమించిందన్నారు. తూర్పు కాపు బిసి డి సర్టిఫికెట్లు ప్రభుత్వాలు తమకు ఏవిధంగా మంజూరు చేస్తున్నారన్న దానిపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారాం, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, తూర్పు కాపు పట్టణ అధ్యక్షులు ఊడి అప్పారావు, శానాపతి కొండలరావు, మజ్జి తాతబాబు,రాయపురెడ్డి కృష్ణ, పలకా రాము, పడాల కొండలరావు, ఉండూరు దేముడు, యన్నంశెట్టి సీతారామ్, బసవ పరమేష్, గ్రటెడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావుతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు రొబ్బా శ్రీను, పలు మండలాల నుండి భారీ ఎత్తున తూర్పు కాపులు పాల్గొన్నారు.

వైభవంగా ఉల్లి విందులమ్మ జాతర

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో పెనుగొల్లు గ్రామంలో ఉల్లివిందులమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుండి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారి దర్శించుకుని తమ మొక్కలను తీర్చుకున్నారు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు భారీ బాణాసంచా కాల్చారు. అమ్మవారిని మాజీ ఎంపీపీ వై వినోద్ రాజు, టిడిపి సీనియర్ నాయకులు నవీన్ రాజు తదితరులు దర్శించుకున్నారు.

డ్రైనేజీలుగా మారిన రహదారులు

సి.పి.ఎం. మహిళా నేత గూనూరు వరలక్ష్మి

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం పట్టణంలో రహదారులన్నీ డ్రైనేజీలను తలపిస్తున్నాయని భారత కమ్యునిస్టు పార్టీ మహిళా నాయ కురాలు, మిడ్ డే మీల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, ప్రజా సంఘాలు ఆరోపిస్తు న్నాయి. చోడవరం నుండి పిఎస్ పేట వెళ్లే రహదారిలోను, కొత్తవూరు జంక్షన్, చోడవరం మాడుగుల బి.ఎన్. రోడ్లో కాంప్లెక్స్ దాటాక రత్నం రెస్టారెంట్ సమీపంలో డ్రైనేజీలు లీకై ప్రధాన, గ్రామీణ రహదారులను డ్రైనేజీలుగా మార్చుతున్నాయి. డ్రైనేజీ లీకై రోడ్డు మీదకు విపరీతమైన కుళ్ళు బురదలు నీరు వస్తుందని, దీన్ని తక్షణమే అరికట్టాల్సిందిగా వామ పక్ష మహిళా ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. మేజర్ పంచాయితీలో ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, ఛిద్రమైన రహదారులు, కనీసం డ్రైనేజీ, వీధి దీపాలు, త్రాగు నీరు తదితర సమస్యలను తీర్చలేని పరిస్థితిలో చోడవరం పంచాయతీ దిగజారిందని, ప్రజా సమస్యలపై పట్టించుకునే నాథుడే కరువయ్యాడు అన్నారు. ప్రజా సమస్యలపై పలు మార్లు పంచాయతీ కార్యనిర్వహణాధికారి (ఈ.వో), పాలకమండలి సర్పంచ్ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తరచూ ప్రజలు, విద్యార్థులు వచ్చి వెళ్లే రహదారిలో డ్రైనేజీ సమస్య కారణంగా పలువురు ఇబ్బంది పడు తున్నారు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం డ్రైనేజీలో బ్లీచింగ్ గాని దోమల మందు కానీ కొట్టి చాలాకాలం అయిందని వేసవి కాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని కనీసం బ్లీచింగ్ కొట్టే పరిస్థితి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చోడవరంలో ఉన్న పలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు రూ.15 లక్షలు వరకు కేంద్రం విద్యరుణ సదుపాయం



విశాలాంధ్ర - చోడవరం : కేంద్ర ప్రభుత్వం 2015 నుండి అమలు చేస్తున్న విద్యాలక్ష్మీ పథకం క్రింద విద్యార్థులు సుమారు ర.15 లక్షలు వరకు ఋణం పొందవచ్చు. ముందుగా విద్యాలక్ష్మి పోర్టల %https://vidyalakshmi.co.in%/లో విద్యార్థులు తమ పేరు రిజిస్టర్ చేసుకోవాలి. అవసరమైన వివరాలను ఎంటర్ చేసి, అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఆ వివరాలతో లాగిన్ అవ్వాలి. ఈ రోజుల్లో ఉన్నత విద్యకు అయ్యే ఖర్చులు పెరిగిపోయాయి. స్కూల్, ఇంటర్మీడియట్ వరకు ఎలాగోలా చదువు కోగలిగినా, ఆపై చదువులు చాలా మంది చదవలేకపోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. అందుకే 2015లో పీఎం విద్యా లక్ష్మి ఎడ్యుకేషన్ లోన్ యోజన పథకం ప్రారంభించబడింది. దీని ద్వారా, ఏ భారతీయ పౌరులైనా ఉన్నత విద్య కోసం రూ.15 లక్షల వరకు బ్యాంకు లోన్ తీసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే లోన్ కోసం అప్లై చేయవచ్చు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ముందుకు కొనసాగించలేని వారెవరైనా ఈ పథకం ద్వారా లబ్ది పొందవచ్చు. 10o2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఈ పథకం కింద లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రభుత్వ పథకం ద్వారా, విద్యార్థులు బ్యాంకుల నుంచి రూ.7.5 లక్షల వరకు ఎడ్యుకేషన్ లోన్ అందుకోవచ్చు. విదేశాలలో చదువుకోవాలనుకుంటే, రూ.15 లక్షల వరకు లోన్ లభిస్తుంది. ఈ మొత్తంపై వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది. విద్యా లక్ష్మి ఎడ్యుకేషన్ లోన్ వడ్డీ రేటు 8.40% నుండి ప్రారంభమవుతుంది. ఈ స్కీమ్ కింద స్కాలర్‌షిప్స్, విద్యా రుణాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి, ప్రధాన మంత్రి విద్యా లక్ష్మి యోజన అధికారిక వెబ్‌సైట్ %https://www.vidyalakshmi.co.in/Students%/విజిట్ చేయవచ్చు. ఈ వెబ్‌సైట్‌లోనే లోన్ కోసం అప్లై చేసుకోవచ్చు. అప్లికేషన్ ప్రాసెస్.....ముందు విద్యాలక్ష్మి పోర్టల్ %https://vidyalakshmi.co.in%/లో రిజిస్టర్ చేసుకోవాలి. అవసరమైన వివరాలను ఎంటర్ చేసి, అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఆ వివరాలతో లాగిన్ అవ్వాలి.అకౌంట్‌కు లాగిన్ అయ్యాక "కామన్ ఎడ్యుకేషన్ లోన్ అప్లికేషన్ ఫామ్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. అవసరమైన అన్ని వివరాలను జాగ్రత్తగా నింపాలి. ఫామ్‌తో ఒకేసారి మూడు బ్యాంకులకు లోన్ కోసం అప్లై చేసినట్లు అవుతుంది. ఈ ఫామ్‌ను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ జారీ చేసింది. ఫామ్‌ను ఫిల్ చేశాక అవసరాలకు అనుగుణంగా విద్యా రుణం కోసం సెర్చ్ చేయవచ్చు. అర్హత, సౌకర్యం ప్రకారం లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యాలక్ష్మి పోర్టల్‌లో %జజుజూకీ% ద్వారా ఒక విద్యార్థి గరిష్టంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. లోన్ మంజూరు అయ్యాక దానిని సకాలంలో తిరిగి చెల్లించాలి.

అవసరమైన డాక్యుమెంట్స్

ఈ పథకం కింద 13 బ్యాంకులు లిస్ట్ అయ్యాయి. ఇవి 22 రకాల విద్యా రుణాలు ఇస్తాయి. రుణం కోసం ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేదా పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, అడ్రస్ ప్రూఫ్ వంటి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయడం తప్పనిసరి. అడ్రస్ ప్రూఫ్‌గా విద్యుత్ బిల్లు, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ బిల్లు, బ్యాంకు స్టేట్‌మెంట్ వంటివి సబ్మిట్ చేయవచ్చు. పైన పేర్కొన్న డాక్యుమెంట్స్‌తో పాటు, పేరెంట్స్ ఇన్‌కమ్ సర్టిఫికెట్, హైస్కూల్, ఇంటర్మీడియట్ మార్క్ షీట్‌ల ఫొటోకాపీలు, చదువుతున్న సంస్థ అడ్మిషన్ కార్డు అందించాలి. అన్ని రకాల ఖర్చులకు సంబంధించిన పూర్తి వివరాలు, కోర్సు వ్యవధి కూడా మెన్షన్ చేయాలి.

సైతారుపేటలో గుర్రాల పోటీలు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో సైతారు పేట గ్రామంలో గుర్రం పందాల పోటీలు నిర్వ హించారు. ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోటీలను ఏర్పాటు చేయగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి గుర్రాలను తీసుకొని వచ్చి పోటీల్లో పాల్గొన్నారు గెలిచిన వారికి నగదు బహుమతులను ఉత్సవ కమిటీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావి రమణబాబు, మాజీ సర్పంచ్ వీసం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు బ్రాండిక్స్

విశాలాంధ్ర - అచ్యుతాపురం : ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా ఉండాలనే ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి అన్నారు . ఆదివారం బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు . ఈ వైద్య శిబిరానికి 450 మంది హాజరు కాగా 410 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 278 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించి, 66 మందికి మందులను అందజేశారు. వీరిలో 50 మందికి కేట్రాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, ఫలహారాలు అందించినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలకు ఎంపికైన తిమ్మరాజుపేట విద్యార్థులు

విశాలంధ్ర - అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి జరిగిన పరీక్షలలో తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుదే జ్యోతిక అపర్ణ, అలమండ చరణ్, పప్పు భవితలు ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల పాటిపల్లికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సహో పాధ్యాయుని వై. అరుణకుమారి, గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మిశివబాపు నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆదారి అనంతరావు కమిటీ సభ్యులు అభినందించారు

మోడీ ప్రమాణ స్వీకారం సంబరాలు

విశాలంధ్ర - అచ్యుతాపురం : దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి, బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, సర్పంచ్ కోరుపోలు చిన్నారావు, చుక్క అనురాధ, కె.నాయుడుబాబు, మేరుగు కాసుబాబు, రాజు, గ్రామ కమిటీ ప్రెసిడెంట్లు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రాకేష్ రెడ్డి, పద్మశ్రీలను వెంటనే సస్పెండ్ చేయాలి

పీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్

విశాలాంధ్ర - పాయకరావుపేట : పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాయకులు రాకేష్ రెడ్డి, పద్మశ్రీ లను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పిసిసి జనరల్ సెక్రటరి జగతా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంతో కష్టపడి, మండుతున్న ఎండలు సైతం లెక్కచేయకుండా రాష్ట్రం మొత్తం తిరిగి కాంగ్రెస్ పార్టీకి పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఊపిరి పోసారని తెలిపారు. షర్మిల పిసిసి పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేశారన్నారు. గత పది సంవత్సరాలతో పోల్చితే ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. బలమైన ప్రతిపక్ష పార్టీలు నాయకులే జగన్మోహన్ రెడ్డిని విమర్శించడానికి భయపడే పరిస్థితుల్లో షర్మిల ఏకిపారేసారని తెలిపారు. అలాంటి ధైర్యశాలి షర్మిలపై రాకేష్ రెడ్డి, పద్మశ్రీ స్వలాభం కోసం నిందలు వేశారని విమర్శించారు. వారిద్దరు కాంగ్రెస్ పార్టీలో కొనసాగే అర్హత కోల్పోయారని జగతా శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పోలవరపు అప్పలరాజు, నక్కపల్లి మండల అధ్యక్షులు ప్రగడ చక్రధర్, బర్రె జగనాదం, ప్రసాద్, రాజు, కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెడ్డ వాగు కనుమరుగు స్పందించని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - పరవాడ : పరవాడ మండలం ఈ. బోనంగి రెవెన్యూలో ప్రభుత్వ భూములు దర్జాగా ఆక్రమణకు గురవుతున్నాయి. భూ కబ్జాల్లో ఆరితేరిన ఘనుడే ఇక్కడ కోట్లు విలువైన ప్రభుత్వ భూములను దర్జాగా కొట్టేస్తున్నాడు. అతని కన్ను పడిందంటే చాలు చెరువైనా, గెడ్డవాగైనా, ఇంకే ప్రభుత్వ భూమైనా అతని సొంతం కావాల్సిందే. కొద్దిపాటి స్థలం కొనడం పక్కనున్న ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్మేయడం అతని నైజం. ఇదే క్రమంలో ఈ.భోనంగి సర్వే నెంబర్ 300గల గెడ్డ వాగు కనుమరుగైంది. ఆర్కే లే ఔట్ ను ఆనుకుని ఉన్న గెడ్డ వాగును కూడా ఆక్రమించి తన సొంత భూమిలో కలిపేసుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే దీని విస్తీర్ణం మొత్తం 1.38 ఎకరాలుగా రికారులో చూపిస్తున్నప్పటికీ అసలు గెడ్డ వాగు ఆనవాలు లేకుండా పోయింది. ఒక పేరు మోసిన కబ్జాదారుడు ఆక్రమించినట్లు కొందరు చెబుతున్నారు. కొండ ప్రాంతం నుంచి పాత గొర్లివానిపాలెం కుమ్మరి చెరువుకి ఈ గెడ్డ వాగు నుంచే వర్షం నీరు చేరేది. ఈ గెడ్డ కాస్త ఆక్రమణకు గురవడంతో ఆ వర్షం నీరంతా రోడ్లపై నిలిచిపోతుంది. పైగా ఈ గెడ్డ వాగు ఆక్రమణపై అనేక సార్లు రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బడా బాబులతో వ్యాపార తత్సంబందాలు ఉండటంతోనే అధికారులు కూడా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన గెడ్డ వాగును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. గెడ్డ వాగు మొత్తాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని, ఆపై ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హెల్పింగ్ హ్యాండ్ పర్ పూర్ పీపుల్ సేవా సంఘం

విశాలాంధ్ర - రావికమతం : హెల్పింగ్ హ్యాండ్ పర్ పూర్ పీపుల్ సేవా సంఘం కొత్తకోట గ్రామంలో ఆదివారం మూడు వందల మంది వృద్ధులకు, అనాధలకు, బిక్షగాళ్లకు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం మరియు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు బిచ్చగాళ్లకు, నిరుపేద వృద్ధులకు ఆహారాన్ని మరియు దుప్పట్లు పంపిణీ చేసారు. కొవ్వూరు మరియు బొడ్డుపల్లి వృద్ధాశ్రమాలకి ఆహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద వృద్ధులకు, అనాధలకు, వికలాంగులకు, భిక్షాటన చేసే వారి ఆకలి తీర్చడమే మన ధ్యేయం. అన్ని దానాలలోకి అన్నదానం గొప్పదని బావించి ఈ రోజున ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 70 మంది వాలంటీర్లు పాల్గొన్నారు ఫౌండర్ కం ప్రెసిడెంట్ (విరోతి ఆనంద్) వైస్ ప్రెసిడెంట్ కొప్పు శ్రీనివాసరావు)) జనరల్ సెక్రెటరీ జవాది రాజా జాయింట్ సెక్రెటరీ గట్ రెడ్డినాగేశ్వరరావు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ : కొర్ర గణేష్, గుమ్మడి జగదీష్, సభ్యులు: కోట బాబీ, చిత్రాడ రాజు, బేతా భాస్కర్ రాజు, వెల్లంకి ప్రసాద్, గట్టా ఈశ్వరరావు తదితరులు పాల్గొంటున్నారు.

సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - కశింకోట : అనకాపల్లి నియోజకవర్గం కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అత్యధిక మెజార్టీతో గెలుపొంది అనకాపల్లి రాజకీయ చరిత్రను తిరగరాసి కనివిని ఎరుగని మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా విజయోత్సవ శుభా కాంక్షలు తెలుపుతూ కశింకోట మండలం లో భారీ మెజార్టీతో విజయానికి కారకులైన గొంతిన శ్రీనువాసురావును అలాగే ఏనుగుతుని చిన ఏనుగుతుని గ్రామలలో భారీ మెజార్టీ రావడానికి కారుకులైన గొంతిన చిరంజీవిని అబింనదిస్తూ చినఏనుగు తుని గ్రామ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నాయకులు సాలువాతో సత్కరించి కేకు కట్ చేసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్య క్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకు నాయుడు, ఆడారీ రమణ బాబు, ఆదారి సత్తిబాబు,ఆదారి సూరిబాబు, యల్లాపు వెంకట సూరి అప్పారావు, పెదపాటి రాము, పెదపాటి రమణ, నక్కా శ్రీను,నక్క నూకరాజు, పొలమరశెట్టి రమణ నారపల్లి శంకర్ మోటూరి ఉపేంద్ర నాయుడు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి ఒడ్డు పండగ

విశాలాంధ్ర - చీడికాడ : మండల కేంద్రంలోని బొడ్డు మోదినాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి ఒడ్డు పండగ ఘనంగా నిర్వహించారు 50 ఘటాలలో గ్రామ పురవీధుల మీదుగా డప్పు వాయిద్యాలతో అమ్మవారి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కును తీర్చుకున్నారు సుమారు 300 మంది మహిళలు అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించారు ఈ సందర్భంగా బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా అమ్మవారి పండగ ఆనవయతీగా చేయడంతో ఈ సంవత్సరం కూడా నిర్వహించమన్నారు.